క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలోని మల్లిక హాస్పిటల్‌లో ఉచిత డయాబెటీస్ జనరల్ సర్జరీ క్యాంపును ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నామని జనరల్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్, షుగర్ వ్యాధి నిపుణులు దూదిమాని రెడ్డిప్రసాద్ తెలిపారు. ఈ క్యాంపులో ఉచిత కన్సల్టేషన్, ల్యాబ్ సౌకర్యం, ఉచిత నరాల పటుత్వ పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. రిజిస్ట్రేషన్ కోసం 8522084494, 9966581999 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు సాహితీ సదస్సు

కడప కల్చరల్ : నెలనెల రాయలసీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం 5.00 గంటలకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సాహితీ సదస్సు నిర్వహించనున్నామని బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఆచార్య కొత్తపల్లి గంగాధర వేణు నాటకాలు–ఒక పరిశీలన అంశంపై ప్రసంగం ఉంటుందని వివరించారు.

'98' డీఎస్సీ అభ్యర్థుల వినతి

కడప ఎడ్యుకేషన్ : 1998 అభ్యర్థులకు త్వరగా జాయినింగ్ లెటర్స్‌ను ఇప్పించి న్యాయం చేయాలని 1998 అభ్యర్థులు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డిని కోరారు. శనివారం సాయంత్రం కడపలోని జెడ్పీ ఆవరణలో ఆయనను కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1998 డీఎస్సీ అభ్యర్థులకు గత ప్రభుత్వం చేయని విధంగా ఈ ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేసిందన్నారు. ఇందుకు సంబంధించి ఎంపిక చేసిన అభ్యర్థులకు త్వరగా జాయినింగ్స్‌ను ఇప్పించాలని వారు కోరారు. డీఎస్సీ అభ్యర్థులు, రామచంద్ర, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

హాకీకి పూర్వ వైభవం తీసుకురావాలి



హాకీ ఇండియా ప్రతినిధులతో ధ్యాన్‌చంద్ అకాడమీ డైరెక్టర్

కడప స్పోర్ట్స్: హాకీ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి బోళానాథ్‌సింగ్, మాజీ కార్యదర్శి ముస్తాక్‌లను కడప ధ్యాన్‌చంద్ అకాడమీ డైరెక్టర్ ఎస్. సుభాన్‌బాషా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భువనేశ్వర్‌లో హాకీ ఇండియా ప్రతినిధులను కలిసి ఇటీవల వరల్డ్ కప్ నిర్వహించడంపై సంతోషాన్ని వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. హాకీ క్రీడకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కడప నగర కార్పొరేటర్లు షంషీర్, గౌస్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రైలు మార్గాలకు నిధులు కేటాయించాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : కేంద్ర బడ్జెట్‌లో రాయలసీమ ప్రాంతంలోని రైలు మార్గాలకు నిధులు కేటాయించాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న కేంద్ర రైల్వే బడ్జెట్‌లో రాయలసీమలోని రైల్వే మార్గాలకు అత్యధికంగా నిధులు కేటాయించి కడప, బెంగుళూరు రైలు మార్గాన్ని పూర్తి చేయాలన్నారు. రైల్వే నిధుల కేటాయింపుపై సీమ ప్రాంతంలోని ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు. ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం కొత్త రైల్వే ప్రాజెక్టులను ఇచ్చి కొత్త రైళ్లను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు లింగమూర్తి, మగ్బూల్‌బాష, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శిగా జయవర్ధన్ ఎన్నిక

కడప ఎడ్యుకేషన్ : అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) రాష్ట్ర కార్యదర్శిగా కడపకు చెందిన జయవర్ధన్ ఎన్నికయ్యాడు. ఈ నెల 25, 26 తేదీల్లో కాకినాడలో జరిగిన అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ ద్వితీయ మహాసభల్లో జయవర్ధన్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 19వ జాతీయ మహాసభలు హైదరాబాదు వేదికగా ఫిబ్రవరి 23, 24,25, 26 తేదీలలో జరుగనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ తెలిపారు. ఈ మహాసభలకు 29 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. యువత, ప్రజలు, మహిళలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మూగ జంతువులను ప్రేమగా చూసుకోవాలి

రాజుపాళెం: మూగ జంతువులను ప్రతిఒక్కరూ ప్రేమగా చూసుకోవాలని గాదెగూడూరు పశువైద్యాధికారి ప్రదీప్‌రెడ్డి అన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల సందర్భంగా మండలంలోని గాదెగూడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ అశోక్, అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ ఆరీఫ్ పాల్గొన్నారు. **కొత్రపాడులో :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు జంతు సంరక్షణ పక్షోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పశువైద్యాధికారిణి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పథకాల జాతర

'గడప గడపకు మన ప్రభుత్వం'లో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో సంక్షేమ పథకాల జాతర నడుస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా 85వ రోజు 42వ డివిజన్ పరిధిలోని రవీంద్రనగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలుగుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా పథకాలు అర్హులకు అందడం లేదా..అని ఆరా తీశారు. ముఖ్యమంత్రి సంతకం చేసిన బుక్‌లెట్‌ను అందజేసి ఇదివరకు ఏ ప్రభుత్వాలైనా ఇంత లబ్ధి చేకూర్చాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జి. మహాలింగయ్య అనే వ్యక్తి మాట్లాడుతూ తనకు వైఎస్సార్ పింఛన్ కానుక, సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.10.64లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. గౌడ సరస్వతి అనే మహిళ మాట్లాడుతూ జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన, సున్నావడ్డీ, వైఎస్సార్ ఆసరా, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.9.84లక్షల లబ్ధి చేకూరిందని తెలిపింది. ఎస్. మహబూబ్‌బీ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో వివిధ పథకాల ద్వారా రూ.9.74లక్షల మేలు జరిగిందని ఆనందం వ్యక్తం చేసింది. పేదల పక్షపాతిగా ఉన్న ఈ ప్రభుత్వమే కలకాలం ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, టీఎస్సార్, బీహెచ్ ఇలియాస్, 42వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చల్లా రాజశేఖర్, సుబ్బారెడ్డి, షఫీ, పస్తం అంజి, ఆర్‌వీ రమణ, లక్ష్మీనారాయణ, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

రాష్ట్ర ప్రజల ఆరోగ్య క్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం రాత్రి తన క్యాంపు కార్యాలయంలో అనారోగ్య కారణాలతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న నగరానికి చెందిన షేక్ సికిందర్ రూ.4.56లక్షలు, కొండూరు చిన్నమరాజుకు రూ.6లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకోవాలి

మున్సిపల్ ఉర్దూ, మెయిన్ స్కూల్లో వ్యక్తిత్వ వికాసం కెరీర్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న స్టెప్ సీఈఓ సాయిగ్రేస్

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ జీవిత లక్ష్యాన్ని ఎంచుకుని అందుకు అనుగుణంగా కష్టపడాలని స్టెప్ సీఈఓ సాయి గ్రేస్,వ్యక్తిత్వ వికాస నిపుణులు నరసింహాచారి సూచించారు. శనివారం యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్, ఉర్దూ బాలుర హైస్కూల్‌తోపాటు సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో వ్యక్తిత్వ వికాసం– కెరీర్‌పై కౌన్సెలింగ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణులు నరసింహాచారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మంచి ఆరోగ్య, అలవాట్లను అలవరచుకోవాలన్నారు. స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మాట్లాడుతూ యువజన సర్వీసులశాఖ ద్వారా యువతకు వ్యక్తిత్వ, వికాసంతోపాటు కళలు, క్రీడలు, దిశ యాప్ మొదలగు వాటిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పుష్పలత, ఉపాధ్యాయులు రామోహన్, సిద్దారెడ్డి, శ్రీదేవి, సాజిద్, ఇలియాస్, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

లూర్దుమాత తిరునాలకు జోరుగా ఏర్పాట్లు



తిరునాలకు జరుగుతున్న ఏర్పాట్లు

కడప కల్చరల్ : కడప నగరం మరియాపురంలో ఫిబ్రవరి 2 నుంచి 11వ తేది వరకు నిర్వహించనున్న తిరునాల కోసం జోరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నిర్వాహకులు దీనికోసం స్థానిక దైవ సేవకులు జోసెఫ్‌ను తిరునాల కమిటీ చైర్మన్‌గా నియమించారు. రెండు రోజులుగా ఆయన ఆధ్వర్యంలో పలు బృందాలు పాత చర్చి మైదానంలో తిరునాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బండ లాగుడు పోటీకి మైదానాన్ని సిద్ధం చేశారు. చర్చి ప్రధాన భవనాలన్నింటికీ రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ముఖ ద్వారం, లోపల ఆర్చీలు, రంగురంగుల విద్యుద్దీపాల కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన ప్రసంగాల వేదికపైన, వేదిక ముందు భారీగా షామియానాలు, పందిళ్లు అలంకరిస్తున్నారు. ప్రాంగణంలో ప్రధాన వేదిక సమీపంలోనే భారీగా పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. తిరునాల ప్రాంతమంతా విద్యుద్దీప సౌకర్యం కల్పిస్తున్నారు.

టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు వి.జయప్రకాశ్



మాట్లాడుతున్న వి.జయప్రకాశ్

ప్రొద్దుటూరు : టెన్త్‌లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు వి.జయప్రకాశ్ తెలిపారు. ప్రొద్దుటూరు బాలికల కళాశాల వసతి గృహంలో శనివారం ప్రొద్దుటూరు, కమలాపురం ఏఎస్ డబ్ల్యూఓ పరిధిలోని వసతి గృహాల పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం చదివితే విజయం సాధించవచ్చని తెలిపారు. విషయ నిపుణులు నాగేశ్వరరావు, ఇంగ్లిషులో ఎం.హృషికేశవ ఆచారి, సైన్స్‌లో బి.చంద్రమోహన్, గణితంలో సంజీవరెడ్డి, హిందీలో కె.బాలరాజు పరీక్షల్లో మంచి మార్కులు ఎలా సాధించాలో మెలకువలు వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు బి.గురుప్రసాద్, టి.స్వర్ణలత, వసతి గృహ సంక్షేమ అధికారులు ఎ.రామకృష్ణారెడ్డి, ఎం.బ్రహ్మం, బి.నాగరాజునాయక్, ఎస్ఎం బషీర్, వి.నాగరాజు, సి.గురుజ్యోతి, బి.శివలక్ష్మి, ఎస్.వహీదా బేగం, ఎల్.నరసారెడ్డి, డి.రాజగోపాల్‌రెడ్డి, బుజ్జమ్మ, ఎల్.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

కషాయాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఏఓ లక్ష్మీప్రసన్న

మైదుకూరు : ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్న రైతులు ఆర్బీకేలలో ఉన్న కషాయాలను వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న తెలిపారు. మండలంలోని జీవీ సత్రంలో శనివారం స్వయం సహాయక సంఘాల మహిళలకు నాబార్డు సహకారంతో రెండో రోజు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులను తగ్గించుకోవచ్చునన్నారు. సేంద్రీయ ఎరువులను వాడటం వల్ల భూ సారాన్ని పెంచవచ్చని తెలిపారు. వనిపెంట కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త కాంతిశ్రీ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు పంటల సాగులో చైతన్యవంతులుగా ఉన్నారన్నారు. వివిధ పంటల సాగులో మెళకువలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు సూర్యనారాయణరెడ్డి, నాగలక్ష్మి, డీపీసీసీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, సీఆర్పీలు బాలయ్య, బాలస్వామిలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చేతిరాత విజేతలకు బహుమతులు



చేతిరాత పోటీల్లో విజేత విద్యార్థులతో అధికారులు

పోరుమామిళ్ల : అక్షర హ్యాండ్ రైటింగ్ అకాడమీ డైరెక్టర్ మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చేతిరాత పోటీల్లో విజేతలకు శనివారం పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బహుమతులు అందచేశారు.

సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా జనవరి 23న జిల్లా స్థాయి చేతిరాత పోటీలు నిర్వహించారు. విజేత విద్యార్థులకు సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఎస్ఎ జిల్లా కోఆర్డినేటర్ దశరథరామిరెడ్డి చేతుల మీదుగా బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్, మెమొంటోలు అందచేశారు. కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గానుగపెంట రమణారెడ్డి, ప్రిన్సిపాల్ జయసుబ్బారెడ్డి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బియస్ నారాయణరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అట్లూరు : మండల పరిధిలోని కడప – బద్వేలు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించి జరిమానా విధించినట్లు బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు తెలిపారు. శనివారం సాయంత్రం రికార్డులు సక్రమంగా లేని 6 వాహనాలకు రూ.30 వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన డ్రైవర్లతో మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని, ఈ విషయాన్ని డ్రైవర్లు గుర్తించాలని, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

బద్వేలు అర్బన్ : చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజ, వ్యవసాయ కమిషనర్ కార్యాలయ పరిశీలకులు బి.వి.సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బోవిళ్ళవారిపల్లె గ్రామంలో చిరుధాన్యాల సాగు, వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు చిరుధాన్యాల పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి ఓబయ్య, జెడ్‌బీఎన్‌ఎఫ్ డివిజనల్ యాంకర్ నాగసుబ్బరాయుడు, వ్యవసాయ గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రేపు వైద్య శిబిరం

చాపాడు : అన్నవరం గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వైద్య శిబిరం నిర్వహించి మధ్యాహ్నం నుంచి ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక రోగులను పరిశీలించి వారికి అవసరమైన వైద్యం అందించి, మందులు ఇస్తామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూఢనమ్మకాలు వదలడం లేదు



సన్నివేశాలను చిత్రీకరిస్తున్న దృశ్యం

బి.కోడూరు : హైటెక్ యుగంలో కూడా మూఢనమ్మకాలు వదలడం లేదని జబర్దస్త్ టీమ్ లీడర్లు గడ్డం నవీన్, చిట్టిబాబు, డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. సమాజంలో మార్పులు తీసుకొచ్చేందుకే మసకమసక చీకటిలో అన్న టైటిల్‌తో సినిమాను తీస్తున్నామన్నారు. బి.కోడూరు మండలంలోని కోడూరు దుర్గమ్మ, చెన్నకేశవస్వామి, నరసయ్య స్వామి ఆలయాల పరిసర ప్రాంతాలు, బంగారు కొండపై శ్రీమల్లికార్జున క్రియేషన్స్ ప్రొడక్షన్ బ్యానర్‌పై మసకమసక చీకటిలో అన్న టైటిల్‌తో సినిమా షూటింగ్ చిత్రీకరణ జరుపుతున్నామని తెలిపారు. ఇందులో హీరోలు అల్లుదీపక్, హరీష్, నగేష్, హీరోయిన్లు నీలిమా, తన్వీ, మధు, జబర్దస్త్ టీమ్ గడ్డం నవీన్, చిట్టిబాబుల కామిడీ, థ్రిల్లింగ్ సూపర్‌గా ఉంటుందని డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

పోరుమామిళ్ల: చక్కని పనితీరు కనపరచి ప్రభుత్వ అవార్డు పొందిన వారిని శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయసుబ్బారెడ్డి సన్మానించారు. గణతంత్ర దినోత్సవం రోజు కలెక్టర్ ద్వారా అవార్డు అందుకున్న సర్వశిక్షా పథక సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, యస్‌యస్‌ఏ కో ఆర్డినేటర్ దశరధరామిరెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గానుగపెంట రమణారెడ్డిని సన్మానించారు.

శ్రీ విజయదుర్గాలయంలో సూర్యదేవునికి పూజలు



నవగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో శనివారం రథసప్తమిని పురస్కరించుకుని సూర్యదేవునికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ దంపతులు, కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని నవగ్రహ మండపంలోగల సూర్యునికి ఉభయదారులతో కలిసి ప్రత్యేక అభిషేకం, అర్చన నిర్వహించారు. సూర్యుని ప్రసన్నత కోసం పలు పూజలు నిర్వహించారు. భక్తులుకూడా ఈ సందర్భంగా నవగ్రహాలలో ప్రధానమైన సూర్యునికి పాలు, ఇతర ద్రవ్యాలతో స్వయంగా అభిషేకం నిర్వహించి మొక్కుకున్నారు.

బ్రహ్మోత్సవంలో భక్తుల సేవలు



అన్నదానం చేస్తున్న ఉక్కాయపల్లె రాజా



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కమలాపురం కమిషనర్ రాజశేఖర్ తదితరులు

కడప కార్పొరేషన్ : రథ సప్తమి సందర్భంగా దేవునికడప శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలోని పద్మావతి కళ్యాణ మండపంలో కడప నగరపాలక సంస్థ ఉద్యోగులు, నగరపాలక వర్గం ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఈ రత్నాల రాజు ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కమలాపురం కమిషనర్ రాజశేఖర్, టిడ్కో డీఈఈ శ్రీనివాసులు, ఆర్ఐ విశ్వనాథరెడ్డి, సూపరింటెండెంట్ జి. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కడప కల్చరల్ : కడప రాయుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం జరిగిన రథోత్సవంలో పలువురు భక్తులు తమవంతు సేవలను అందించారు. స్థానిక భక్తుడు ఉక్కాయపల్లె రాజా తన మిత్ర బృందంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏకధాటిగా దాదాపు మూడు వేల మందికి పైగా భక్తులకు విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. మాసాపేట సర్కిల్ నుంచి ఆలయం వరకు దాదాపు పదిచోట్ల భక్తులు సేవా భావంతో మంచినీటి ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు, పానకం పంపిణీ చేశారు. మరికొన్ని చోట్ల బఫే పద్ధతిలో అన్నదానం చేశారు. ఉత్సవంలో ఎక్కడా మంచినీటి కొరత లేకుండా పలువురు భక్తులు ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేసి నీళ్ల ప్యాకెట్లను అందజేయడం విశేషం.

■ దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో భక్తులకు స్థానిక ప్రముఖులు అన్నదానం చేశారు. పుత్తా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సంస్మరణగా పుత్తా రామసుబ్బారెడ్డి, సులోచనమ్మ దంపతులతోపాటు వారి కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత సూర్య భగవానుడు



సూర్య నమస్కారాలను ఆచరింపజేస్తున్న డాక్టర్ రంగనాథరెడ్డి

కడప కల్చరల్ : సృష్టిలో సకల జీవరాశులకు ఆరోగ్యాన్ని ప్రసాదించే సూర్య భగవానుడి శక్తిని సైన్స్ కూడా ఆమోదిస్తోందని స్పెషల్ కలెక్టర్ రామ్మోహన్ అన్నారు. తిరుమల–తిరుపతి దేవస్థానాల అనుబంధ సంస్థ హిందూ ధర్మ ప్రచార పరిషత్ శనివారం రథసప్తమిని పురస్కరించుకుని కడప నగరంలోని సాయి విజ్ఞాన్ హైస్కూలులో విద్యార్థులతో శాస్త్రీయంగా సూర్య నమస్కారాలు చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పెషల్ కలెక్టర్ రథసప్తమి విశిష్టతను వివరించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా మానవుని ఆరోగ్యంపై సూర్యుని ప్రభావం గొప్పగా ఉందని తెలిపారు. ప్రముఖ యోగా థెరపిస్టు, లయన్ డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి తొలుత ఆదిత్య హృదయం పఠింపజేసి సూర్య నమస్కారాల విశిష్టతను తెలియజేశారు. అనంతరం సూర్య నమస్కారాలను చేయించారు. హైస్కూలు చైర్మన్‌భూపతిరాయల్, ప్రిన్సిపాల్ మైథిలి సూర్యనమస్కారాలు ఆచరించారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో గృహ సారథులు చురుగ్గా పనిచేయాలని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన వలంటీర్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వానికి వలంటీర్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు మూల స్తంభాల్లాంటివారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకం పెట్టుకున్నారని ఆయన మీ మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. గతంలో ప్రతి 50 ఇళ్లకు ఒక్క వలంటీర్‌ను నియమించడం జరిగిందని ప్రస్తుతం మరో ఇద్దరు చొప్పున కన్వీనర్లు, గృహసారథులను నియమించడంతో పాటు మరో ఇద్దరు డ్వాక్రా మహిళలను బాగ స్వాములను చేయడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా వారికి కేటాయించిన 50 ఇళ్ల వద్దకు కలసికట్టుగా వెళ్లి వారికి తెలియజేయడంతో పాటు వారి సమస్యలను గుర్తించి వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ విజయం కొరకు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కృషిచేయాలని తెలిపారు. వీరందరికీ ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం జరుగుతోందని తెలియజేశారు. కార్యక్రమంలో సీకేదిన్నె జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజుల్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సమావేశం

పెండ్లిమర్రి : స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు గ్రామ సచివాలయ కన్వీనర్ల, గృహ సారదులకు సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ల అధ్యక్షుడు రామమోహన్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని సచివాలయ కన్వీనర్ల, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపండి

ప్రొద్దుటూరు క్రైం : ఫిబ్రవరి 11న నిర్వహించనున్న నేషనల్ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ హారిక తెలిపారు. కోర్టుహాల్‌లో శనివారం పట్టణంలోని పోలీసు అధికారులతో మెజిస్ట్రేట్ చర్చించారు. క్రిమినల్, చెక్‌బౌన్స్ కేసులు, తగాదాల కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు సహకరించాలని సూచించారు.